సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 25 । జనవరి । 2023



కిటకిటలాడిన మద్ది

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



ఆకట్టుకున్న నాటకం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వార్షికోత్సవాల్లో మంగళవారం శ్రీమావుళ్లమ్మ నాట్యమండలి ప్రదర్శించిన పంచరత్నాలు నాటిక ప్రేక్షకులను అలరించింది.



వర్గీకరణను వ్యతిరేకించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకమని బీజేపీ ప్రకటన చేయాలని కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్‌ను మాల మహానాడు అధ్యక్షుడు మంగరాజు కోరారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు



పి.ప్రశాంతి, పశ్చిమ గోదావరి కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అందించే బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపికైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం తెలిపారు. అవార్డును 13వ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందజేస్తారు. ఓటరు చైతన్య కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసినందుకు, అత్యధిక ఓటర్లను నమోదు చేసినందుకు రాష్ట్రంలో ఎంపిక చేసిన ముగ్గురు కలెక్టర్లలో ప్రశాంతి ఉండటం పట్ల జిల్లా అధికారులు హర్షం చేశారు.

పశువైద్య సేవ వాహనాలు మంజూరు

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాకు కొత్తగా మరో ఆరు వైఎస్సార్ సంచార పశువైద్య ఆరోగ్య సేవా వాహనాలు మంజూరైనట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాకు ఏడు వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు అందించామన్నారు. కొత్తగా ఆరు వాహనాలతో కలిపి మొత్తం 13 వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొత్తగా మంజూరైన వాహనాల్లో అత్తిలి 1, మార్టేరు 1, యలమంచిలి 1, మొగల్తూరు 1, ఉండి 1, పట్టింపాలెంకు ఒకటి చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

బీజేపీ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానం



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. మంగళవారం భీమవరంలో నిర్వహించిన సమావేశంలో పలు రాజకీయ తీర్మానాలు చేశారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలను ప్రజలు వదిలించుకోవాలని మరో తీర్మానం చేశారు. బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని తీర్మానించారు. కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కేంద్ర మంత్రులు వి.మురళీధరన్, భారతీ ప్రవీణ్ పవార్, పార్టీ నాయకులు సునీల్ దేవ్‌ధర్, శివ ప్రకాష్, జీవీఎల్ నర్సింహరావు, మాధవ్, నారాయణరెడ్డి తదితరులు మాట్లాడారు.

యూనియన్ బ్యాంక్ మండి పథకం ప్రారంభం



మండి పథకం బ్రోచర్ విడుదల చేస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: రైస్‌మిల్లర్స్, కిరాణా, కోకోనట్ వంటి వ్యాపారస్తులకు మండి పథకం వల్ల తక్కువ వడ్డీకే రుణాలు మంజూరయ్యే వెసులుబాటు ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ హెడ్ ఎంఎస్ రామారావు తెలిపారు. మంగళవారం పాలకొల్లులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హోల్‌సేల్ వర్తకుల మండి పథకం బ్రోచర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎస్ రామారావు మాట్లాడుతూ ఈ మండి పథకం ద్వారా వర్తకులకు తక్కువ వడ్డీకి రుణాలు పొందడమే కాకుండా మరిన్ని సదుపాయాలు ఉచితంగా లభిస్తాయన్నారు. వర్తకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకృష్ణన్, చీఫ్ మేనేజర్లు రామమోహనరావు, మురళీ, చైతన్య, వ్యాపారస్తులు వేగేశ్న రంగరాజు, గొనుగుంట్ల శ్రీనివాసు, జక్కంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న ఏలూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో డిప్లమో ఇంజనీర్ ట్రైనీ కోసం ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలు కళకళ

- ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయాల పోస్టులు భర్తీ
- 10 ఏళ్ల తర్వాత సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీ
- అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ల హర్షం
- జిల్లాలో 5 అంగన్‌వాడీ ప్రాజెక్టులు, 1562 అంగన్‌వాడీలు



కొత్తగా ఎంపికైన అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్(ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో అంగన్‌వాడీల పటిష్టానికి, గర్భిణులు, చిన్నారులకు అన్ని సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు అంగన్‌వాడీల్లో ఎలాంటి పోస్టులు ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకుంది. ఖాళీ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పోస్టులను ప్రభుత్వం వేగంగా భర్తీ చేసింది. గత నెలలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన రోజుల వ్యవధిలోనే కార్యకర్తలు, ఆయాల నియమకం పూర్తి చేయడంతో కొత్తగా ఎంపికైన అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరుతున్నారు. పోస్టులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు భర్తీ చేసి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పూర్తి స్థాయిలో అన్ని రకాల సేవలు అందిస్తుంది.

జిల్లాలో మొత్తం 1562 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 20 అంగన్‌వాడీ కార్యకర్తలు పోస్టులు ఖాళీ అయ్యాయి. 80 ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. మొత్తం 19 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు నూతనంగా విధుల్లోకి వచ్చారు. జిల్లాలో మొత్తం 80 ఆయా పోస్టుల భర్తీ చర్యలు తీసుకుంటే 66 పోస్టుల భర్తీ చేయడంతో వారంతా విధుల్లో చేరారు.

జిల్లాకు 13 మంది సూపర్‌వైజర్లు

పదేళ్లుగా భర్తీకి నోచుకోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. శాశ్వత ప్రభుత్వ ఉద్యోగంగా ఉన్న ఈ పోస్టులను పారదర్శంగా రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం నియామకం పూర్తి చేశారు. దాంతో జిల్లాకు కొత్తగా 13 మంది అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వచ్చారు. ఇప్పటికే జిల్లాలో 20 మంది సూపర్‌వైజర్లు ఉండగా కొత్తగా 13 మంది రావడంతో జిల్లాలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సంఖ్య 33 కు చేరింది.

కార్యకర్తలు, సూపర్‌వైజర్ల హర్షం

పదేళ్లుగా ఎదురుచూస్తున్న సూపర్‌వైజర్ల పోస్టులను ముఖ్యమంత్రి భర్తీ చేయడంతో తాము ప్రభుత్వ ఉద్యోగులుగా మారామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

జిల్లాకు భర్తీ చేసిన సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

జిల్లాలో మొత్తం	
అంగన్‌వాడీ కేంద్రాలు :	1,562
పెద్ద అంగన్‌వాడీలు :	1,492
మినీ అంగన్‌వాడీలు :	70
అంగన్‌వాడీ ప్రాజెక్టులు :	5
అంగన్‌వాడీ కార్యకర్తలు :	1557
అంగన్‌వాడీ ఆయాలు :	1518
సూపర్‌వైజర్లు :	33
సీడీపీఓలు :	5
పీడీ :	1

ప్రాజెక్టు	సూపర్ వైజర్లు	కార్యకర్తలు	ఆయాలు
విస్సాకోడేరు	2	5	15
మొగల్తూరు	3	3	5
పోడూరు	4	3	10
పెనుమంట్ర	1	6	12
ఆకివీడు	3	1	10
నల్లజర్ల	1	4	–
పెంటపాడు	–	4	–
పెరవల్లి	–	6	–

సంతోషంగా ఉంది



నేను 20 ఏళ్ల పాటు అత్తిలి మండలం పాలూరు అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేశాను. గత పదేళ్లుగా భర్తీ కాని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులను సీఎం జగన్ సార్ ఇప్పుడు భర్తీ చేయడంతో సూపర్‌వైజర్‌గా ఎంపికయ్యాను. విస్సాకోడేరు ప్రాజెక్టుకు సూపర్‌వైజర్‌గా వచ్చాను. పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగిగా మారడం చాలా సంతోషంగా ఉంది.

– దాట్ల గీత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

ఎదురుచూపులు ఫలించాయి



20 ఏళ్లగా పెనుమంట్ర మండలం వెలగలేరు అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేశాను. ఇటీవల ప్రభుత్వం భర్తీ చేసిన సూపర్‌వైజర్ పోస్టుల్లో ఎంపికైయ్యాను. చాలా కాలంగా ఎదురుచూస్తున్న సూపర్‌వైజర్ పోస్టులను జగన్ సార్ భర్తీ చేయడం సంతోషంగా ఉంది.

– కె.మోహనరాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్

కొత్త సూపర్‌వైజర్ల ఎంపిక



జిల్లాకు నూతనంగా 13 మంది అంగన్‌వాడీ సూపర్ వైజర్లు వచ్చారు. జిల్లాలో ఖాళీ అయిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులను భర్తీ చేయడం ద్వారా జిల్లా మొత్తం 16 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 66 ఆయాల్ని నియమించాం. జిల్లా కలెక్టర్ సూచనలు, ఆదేశాల మేరకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటాం.

– సుజాత రాణి, పీడీ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ

ప్రభుత్వ స్కూళ్లు మిన్న

ప్రముఖ హృద్రోగ నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ సోమరాజు



ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పద్మశ్రీ డాక్టర్ భూపతిరాజు సోమరాజు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ బి.సోమరాజు చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో ముఖాముఖీ జరిగింది. పాఠశాల పూర్వపు విద్యార్థిగా విద్యార్థులతో పలు అంశాలపై చర్చించారు. తొలుత ఆయన మాట్లాడతూ ప్రతీ విద్యార్థి ఉపాధ్యాయుడు చెప్పే పాఠాల్ని బాగా అర్థం చేసుకోవాలన్నారు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన తరువాత వాటిని అవగాహనతో చదువుకోవాలన్నారు. గైడ్స్ చదవడం కన్నా, టెస్టు పుస్తకాలు చదవడంతో మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులూ కల్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఎంతో ఉన్నత స్థితికి చేరుకున్నారని చెప్పారు. కార్యక్రమానికి హెచ్‌ఎం విజయ భాస్కర్ అధ్యక్షత వహించగా ప్రముఖ వైద్యులు ఎంవీ సూర్యనారాయణరాజు, గొట్టుముక్కల జానకీరామరాజు, భూపతిరాజు రంగరాజు, పిన్నమరాజు గోపాలకృష్ణంరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నెల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు



తాడేపల్లిగూడెం : వాసవి కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఒక సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు జిల్లాల్లోని 4 పరీక్షా కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 1,128 విద్యార్థులకు గాను 1121 మంది హాజరయ్యారు. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షల్లో ఉదయం తొలి సెషన్‌లో 144 మందికి 142 మంది హాజరు కాగా, సాయంత్రం రెండో సెషన్‌లో మొత్తం 144 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 220 మందికి 220 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 220 మందికి 219 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 99 మందికి 97 మంది, మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 100 మంది హాజరయ్యారు. భీమవరం డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం సెషన్‌లో 101 మందికి 99 మంది హాజరు కాగా మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 100 మంది హాజరయ్యారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా, భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో 34వ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మన భద్రత కోసం నిబంధనలు పాటించాలని అన్నారు. మనం జాగ్రత్తగా వెళ్లినా అవతలి వారు నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని.. అందువల్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో 45 శాతం యువత హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం వల్ల చనిపోతున్నారని, రహదారి భద్రతా ప్రమాణాల పట్ల వాహనదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రహదారి భద్రత వారోత్సవాలతో పాటు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ పోటీల విజేతలకు కలెక్టరు చేతుల మీదుగా బహుమతులు అందించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటిచూపు సక్రమంగా లేని వారికి కళ్లద్దాలను కలెక్టరు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కేఆర్ కాలేజ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కెఆర్ నిశాంత్ వర్మ , సెక్రటరీ ప్రతీక్ వర్మ , ప్రిన్సిపాల్ ఎం.జగపతి రాజు, రవాణా శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోశాలను సందర్శించిన కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): 100 గోవులను పోషించడం గొప్ప విశేషమని నిర్వాహకుడు పళ్ల ఏసుబాబును కలెక్టర్ పి.ప్రశాంతి అభినందించారు. పద్మాలయ థియేటర్ రోడ్డులో ఏసుబాబు నిర్వహిస్తున్న శ్రీవిజయలక్ష్మి గోశాలను కలెక్టర్ సందర్శించారు.

ఆడపిల్లలకు మద్దతుగా నిలబడాలి

ప్రతి మనిషి తనపై నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగి ఉన్నప్పుడే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకునే శక్తి వస్తుందని కలెక్టరు అన్నారు. మంగళవారం డీఎన్నార్ కళాశాలలో జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కుటుంబంలో మగ, ఆడ తేడా లేకుండా పిల్లలను పెంచినపుడే సమానత్వం అలవడుతుందన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడానికి ముందుకు వచ్చిన ఆడపిల్లలకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వం బాలికలకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, తమ లక్ష్యాలు సాధించే వరకు కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ హితవు చెప్పారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బి.సుజాతారాణి, వైద్య ఆరోగ్య అధికారి డి.మహేశ్వరరావు, డీఈవో ఆర్.వెంకట రమణ, కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ప్రిన్సిపాల్ బి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల అదుపుపై ఆన్‌లైన్ శిక్షణ

ఏలూరు టౌన్: సైబర్ నేరాల దర్యాప్తుపై పోలీసు సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్‌డివిజన్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ శిక్షణలో రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ కిషోర్, డాక్టర్ ఉదయ్‌శంకర్ పురనిక్, డాక్టర్ ప్రొఫెసర్ వివేకానంద సైబర్ నేరాల దర్యాప్తుపై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగించే విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, నేరాల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ నేరస్తులను పట్టుకోవాలన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదుల సంస్థలకు సైతం సాంకేతిక పరిజ్ఞానం సాయం చేస్తోందని, ఈ క్రమంలో సైబర్ నేరాలు అదుపు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు చట్టాల్లోని లోపాలను వినియోగించుకుని దాడులకు పాల్పడుతున్నారని, వాటిని అడ్డుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు.

బాలరాజును పరామర్శించిన కలెక్టర్



ఎమ్మెల్యే బాలరాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

బుట్టాయగూడెం: తీవ్ర అస్వస్థతకు గురై రాజమండ్రి ఐసీయూలో వైద్యం పొందుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మంగళవారం సాయంత్రం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరామర్శించారు. ఎమ్మెల్యే బాలరాజు అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న కలెక్టర్ హుటాహుటిన రాజమండ్రి వెళ్లారు. ఆస్పత్రికి చేరుకుని ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించడంతో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులను బాలరాజు ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అస్వస్థతకు గురైన సమాచారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కారం వెంకటరమణ, దినేష్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజమండ్రి తరలివెళ్లారు.

ఆళ్ల నాని పరామర్శ

ఏలూరు టౌన్: తెల్లం బాలరాజును ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఫోన్‌లో పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గడపగడపకు సంక్షేమం



భీమవరం అర్బన్ : యనమదుర్రులో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పెనుగొండ : మండలంలోని చెరుకువాడలో గడపగడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ స్థాయికి

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి జిల్లాలోని పలువురు విద్యార్థులు క్రీడల్లో విశేషంగా రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటుతున్నారు. జంగారెడ్డిగూడెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు అండర్-19 విభాగంలో పలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.అరుణ చెప్పారు. మంగళవారం గురుకులంలో విద్యార్థినుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించిన 66వ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకులానికి చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.ప్రియాంక, ఈ నెల 11, 12 తేదీల్లో పెదవేగిలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో కె.రమ్య, టి.సునీత, కె.రాజ్యలక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే రెజ్లింగ్ పోటీల్లో స్టాండ్‌బైగా కె.భవానీ ఎంపికైందన్నారు. విద్యార్థినులను, పీడీ కె.విజయలక్ష్మి, పీఈటీ కె.వెంకటలక్ష్మిలను ప్రిన్సిపాల్ పి.అరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత అభినందించారు.



జంగారెడ్డిగూడెంలో గురుకుల విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అండర్-14లో ఫుట్‌బాల్ పోటీలకు..

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జెడ్పీ హైస్కూలు తొమ్మిదో తరగతి విద్యార్థిని చిటికిన మోహిత పూర్ణ జాతీయ స్థాయి అండర్-14 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో భారతీయ విద్యాభవన్స్‌లో జరిగిన ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో మోహిత ప్రతిభ కనబర్చింది. మంగళవారం స్కూలు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. మోహితను సర్పంచ్ పోతుల అన్నవరం, సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, హెచ్‌ఎం షేక్ లాల్ బీబీ, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.వెంకటేశ్వరరావు, పీడీ ప్రసాద్ అభినందించారు.



మోహితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కిక్ బాక్సింగ్‌లో వర్సిటీ తరఫున..

పెంటపాడు: తాడేపల్లిగూడెంలోని నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో మంగళవారం వర్సిటీ స్థాయి కిక్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. రెండు జిల్లాలకు సంబంధించి పలు కళాశాలల విద్యార్థులు, విద్యార్థినులు హాజరు కాగా, వీరిలో మహిళలు, పురుషుల నుంచి 20 మంది చొప్పున ఎంపిక చేసి పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో పురుషుల నుంచి ముగ్గురు, మహిళల నుంచి ముగ్గురిని ఎంపిక చేశారు. ఫిబ్రవరి 15 నుంచి 19వ తేదీ వరకు హరిద్వార్‌లో జరిగే కిక్ బాక్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని వర్సిటీ క్రీడల కార్యదర్శి బి.రామ్‌గోపాల్ చెప్పారు.



కిక్ బాక్సింగ్ పోటీల దృశ్యం

ఎంపికైన క్రీడాకారులు వీరే..

పురుషులలో వై.పాల్ ప్రఫుల్, జె.ఓంకార్, జీవీవీ మణికంఠ, మహిళలలో ఎస్.సాయిజానకి, పి.సాయి తన్మయి, డి.హర్షప్రియ ఎంపికయ్యారు. రిజిస్ట్రార్, ప్రొఫెసర్ టి.అశోక్, కో-ఆర్డినేటర్ కె.సుబ్బారావు, వర్సిటీ క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం వాసికి అరుదైన పురస్కారం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంకు చెందిన నిడదవోలు వినయ్‌రామ్ అరుదైన పురస్కారానికి ఎంపికయ్యారు. మోస్ట్ ఇన్‌స్పైరింగ్ గ్రీన్ ఎంట్రిప్రెన్యూర్ రంగానికి సంబంధించి చేసిన విశేష కృషికి గాను ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి చేతుల మీదుగా బుధవారం తాను ఈ పురస్కారం అందుకోనున్నట్లు వినయ్ మంగళవారం స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా తెలిపారు. వినయ్ సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి కాగా, అంచెలంచెలుగా ఎదుగుతూ హైదరాబాదులో స్థిరపడ్డారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో సుమారు 1000 ఎకరాల విస్తీర్ణంలో ఆహార పంటలను పండిస్తున్నారు. వినయ్ తండ్రి నిడదవోలు రామారావును గ్రామస్తులు అభినందించారు.

8 లీటర్ల ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ స్వాధీనం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం ఎస్‌ఈబీ చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా ట్యాంకర్‌లో తరలిస్తున్న ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌ను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ ఎస్.మణికంఠా రెడ్డి మంగళవారం చెప్పారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తుండగా మెదక్ నుంచి జార్ఖండ్‌కు వెళుతున్న ట్యాంకర్ లారీలో అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది లీటర్ల ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌ను స్వాధీనం చేసుకుని, డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. సోదాల్లో వీఆర్‌ఓ కొండేటి బుల్లబ్బులు, వీఆర్‌ఏ షేక్ సతాబి, చెక్‌పోస్ట్ సిబ్బంది డి.ప్రవీణ్‌కుమార్, ఎస్‌కే షాను బాబు, ఎస్.జగదీష్ బాబు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కవితా పోటీల విజేతలు వీరే

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కవితా రచనల పోటీల విజేతల వివరాలను జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం విడుదల చేశారు. గాంధేయం-నవ భారతం అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి కవితా రచనల పోటీల్లో 17 మందిని ఎంపిక చేశామని తెలిపారు. తెన్నేటి లక్ష్మీ నర్సింహమూర్తి (పాలకోడేరు), వేమూరి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), వెంకటలక్ష్మి (ఏలూరు), గుండాల మహాలక్ష్మి (ములపర్రు), మీసాల సూర్యనారాయణ (పెదఅమిరం), చివటం సుబ్బారావు (పెనుగొండ), సీఎస్ శాస్త్రి (నరసాపురం), గండి సుధాకర్ (భీమవరం), ఎం.అదృష్టబాబు (వేగవరం), షేక్ అల్లీ సాహెబ్ (ఏలూరు), వీఎస్‌వీ ప్రసాద్ (తణుకు), యండపల్లి పాండురంగ (గణపవరం), ఉప్పలూరు స్వర్ణకుమార్ (భీమవరం), దంతులూరి శ్రీరామకృష్ణంరాజు (తాడేపల్లిగూడెం), వి.అప్పారావు (ఏలూరు), జి.శేషేంద్రరావు (ధవళేశ్వరం), గంధం సాహితి (అత్తిలి) ఎంపిక చేశామన్నారు. వీరికి 30వ తేదీన చాగల్లు మండలం మల్లవరంలోని గాంధీ స్మారక కేంద్రంలో పురస్కారాలు, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

చేతివృత్తిదారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

ఏలూరు (టూటౌన్): చేతి వృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన రూ.52 వేల కోట్లు కేటాయించి కచ్చితంగా వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాలని ఏపీ మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక అగ్రహారంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో చేతివృత్తిదారుల జిల్లా సదస్సు ప్రత్తిపాటి రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వృత్తిదారునికి కుటుంబ సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సహకారం అందించాలని, ప్రతి కుటుంబానికీ నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా మంజూరు చేయాలన్నారు. వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన వృత్తిదారుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వృత్తిదారులకు ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు విధులు నిర్ణయించి, నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. మత్స్యకారుల జీవితాలను ధ్వంసం చేసే జీవో 217ను రద్దు చేయాలని, జీవో నెం.343 ప్రకారం పంచాయతీ చెరువులు స్థానిక మత్స్యకారుల సొసైటీలకు నామమాత్రపు లీజుకు ఇవ్వాలన్నారు. చేపల వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంపుదల చేయాలని కోరారు. జగనన్న చేదోడు పథకం వృత్తిదార్లు అందరికీ ఇవ్వాలన్నారు. చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న విజయవాడలో నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చందనాడ నందేశ్వరరావు, యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఏలూరు నగర కార్యదర్శి కొత్తల శివకుమార్, కల్లుగీత కార్మిక సంఘం ఏలూరు కార్యదర్శి సొంటి శంకర్రావు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఓ రిక్షా కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మావుళ్లమ్మపేటకు చెందిన ఎస్.శ్రీనివాస్ (48) అనే రిక్షా కార్మికుడు మంగళవారం ఉదయం దాసరి నారాయణరావు కాలిబాట వంతెనకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతని భార్య రెండేళ్ల క్రితం మృతి చెందింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అమ్మమ్మ ఇంటి వద్ద, కుమారుడు భరద్వాజ్ తండ్రి వద్ద ఉంటున్నాడు. భరద్వాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాలికలపై వివక్ష లేకుండా చైతన్యం తేవాలి


దువ్వలో బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించిన అంగన్‌వాడీ, ఉన్నత పాఠశాలల విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది


బల్లిపాడులో జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: బాలికలపై వివక్ష లేకుండా చైతన్యం తేవాలని తణుకు యూపీహెచ్‌సీ వైద్యులు డా.పృథ్వీ రాజ్ కోరారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన బాలికల హక్కులు, రక్షణ, పోషణ వంటి వాటిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు చట్ట పరమైన రక్షణలు, వైద్య సంరక్షణలు, హింస, లైంగిక వేధింపులు వంటి అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఏవో డా.డీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, మహిళా పోలీస్ కె మోహన కృష్ణ, హెల్త్ కార్యదర్శి మార్తమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రా ఆఫీసర్లు జీ రమ్య, సీహెచ్ రమేష్ బాబు, వార్డు సచివాలయం సిబ్బంది, విద్యార్థినులు తదితరలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆధ్వర్యంలో...

జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. తణుకు రూరల్ మండలం పైడిపర్రు సెక్టార్ ఆధ్వర్యంలో దువ్వ, కోనాల, ముద్దాపురం, వేల్పూరు, మండపాక, తేతలి, కొమరవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్ వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు వివిధ అంశాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించిన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణాచార్యులు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. తణుకు పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమాలు ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సెక్టార్ల సూపర్ వైజర్లు ఎం అరుణ కుమారి, కె కృష్ణ కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

బాలికలు అత్యున్నత పదవులు అధిరోహించాలి

అత్తిలి: బాలికలు అన్ని రంగాల్లో అత్యున్నత పదవులు అధిరోహించాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, జీవితంలో వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలు సమానసమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండరాదన్నారు. బాల్యవివాహాలు వల్ల కలిగే దుష్పరిణామాలు, బాల్యవివాహ నిరోధకచట్టం2006, పోక్సోచట్టం 2012, పోక్సో సవరణచట్టం 2019పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం మాట్లాడుతూ అన్నిరంగాల్లో పురుషులతో పాటు స్త్రీలు అభివృద్ధి చెందుతూ పురుషులకే సవాళ్లను విసురుతున్నారన్నారు. టీనేజ్ బాలికలు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలని, తమ లక్ష్యాలను సాధించే వరకు కష్టపడి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయినిలు ఎస్ సుజాతదేవి, ఎస్‌కే షర్మిల, యామినిలు మాట్లాడుతూ బాలికలు, పురుషులకు కుటుంబం నుంచే సమానత్వం ప్రారంభంకావాలన్నారు. ఆడ, మగవారిని సమానంగా చూసే విధంగా తల్లిదండ్రుల్లో మార్పురావాలన్నారు. ఆడపిల్లలలో మంచి చదువు, మంచి ఆలోచన, తెలివితేటలు ఉండాలని, సంతులిత ఆహారాన్ని భుజించి ఆరోగ్యంగా ఆత్మస్థైర్యంతో ఉండాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలాంబ, మహిళా సంరక్షణ కార్యదర్శులు స్వప్నశ్రీ, దయామణి రాగసుధ, తిరుపతిపురం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ప్రజల్లో అవగాహన రావాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ డెరెక్టర్ రమ్యసాయి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డైమండ్స్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు. డీవైఈఓ రవీంద్రభారతి హాజరై మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ ఎంతో అవసరం అన్నారు. బాలికలకు ఉండే హక్కులను చెప్పాలని, వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో లియో క్లబ్ అధ్యక్షురాలు మాధురి, స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రామకృష్ణ, పీఈటీ ఇంద్రవాణి, ఉపాధ్యాయులు, లియో సభ్యులు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

ఇరగవరం: మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డివి మాణిక్యంబ,నాగలక్ష్మిల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయరు మాట్లాడుతూ బాలురు, బాలికల మధ్య వ్యత్యాసం, వివక్ష చూపించకూడదన్నారు. బాలికలు అన్నింటిలో ముందుండాలన్నారు. పోషకాహారంతో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ముందు తరాల మనుగడ కోసం ఆడ పిల్లలను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు బాలికల చట్టలు, ప్రవర్తన శైలి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ మాలతి, పీహెచ్‌సీ వైద్యులు గ్రామ సర్పంచ్ కంకిపాటి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి రవీంద్ర, పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెంటపాడు ఆర్బీకేను పరిశీలించిన అధికారులు


పెంటపాడు ఆర్బీకేలో స్టాక్ పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెంటపాడు: మండలంలోని రైతుభరోసా కేంద్రాన్ని మంగళవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా స్టాక్‌ను, రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. విజిలెన్స్ ఎస్పీ కరుణకుమార్ ఆదేశాల మేరకు సీఐ పి. శివరామకృష్ణ తదితరులు ఈ తనిఖీలో పాల్గొన్నారు. రికార్డుల విషయంలో అస్తవ్యస్తంగా ఉన్నాయని సక్రమంగా లేవని గుర్తించారు. ఈ రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పెంటపాడు వ్యవసాయాధికారి కె. పార్థసారధి, వీఏఏ ఝాన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువుకోసం స్థల పరిశీలన


తాగునీటి చెరువు కోసం స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తదితరులు

పెంటపాడు: మండలంలో తాగునీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు పేర్కొన్నారు. కాగా ఆయన ఆధ్వర్యంలో గ్రామంలో మరో తాగునీటి చెరువు కోసం పలు ప్రాంతాల్లో మంగళవారం స్థల పరిశీలన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, మండల సర్వేయర్ జ్యోతి, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు తదతరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి


మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అర్జునరావు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పెన్షనర్లు అందరూ ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని పెన్షనర్స్ సంఘం ఉపాధ్యక్షుడు అర్జునరావు తెలిపారు. పెన్షనర్స్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్ డేట్‌కు సంబంధించి పూర్తి వివరాలు డైరెక్టర్ ఆఫ్ ట్రజరీ నుంచి వస్తాయని, ఆ వివరాలు వచ్చిన తరువాత స్థానిక సబ్ ట్రజరీ వద్ద అప్‌డేట్ చేస్తారని తెలిపారు. ఎవరికి జనవరి నెలకు పెన్షన్స్ ఆగదని వెల్లడించారు. అదే విధంగా లైఫ్ సర్టిఫికెట్స్ ఫిబవరి నెల 28 లోపు దాఖలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యారావు, విశ్వంరాజు, కృష్ణ కుమారి, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, పార్వతీ, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో నేటి నుంచి స్వచ్ఛ సంకల్పం

పెంటపాడు: మండలంలో ఈనెల 25 నుంచి నిరంతరాయంగా జగనన్న స్వచ్ఛసంకల్పం నిర్వహించనున్నట్లు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు పలు ప్రాంతాల్లోని చెత్తను తొలగించడం, డ్రెయిన్‌లలో పూడిక తీయడం, తాగునీటి సమస్యలు నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. శివాలయం నుంచి ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ప్రభ ఉత్సవ ఊరేగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల 32వ జాతర మహోత్సవంలో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారి ప్రభ ఉత్సవ ఊరేగింపు వైభవంగా జరిగింది. విస్సాకోడేరు పాలిమేర, భారతీయ విద్యాభవన్ రోడ్డు నుంచి ప్రారంభమై, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, విద్యుత్ దీపాలంకరణతో సాగింది. ఈ ఉత్సవాన్ని డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి పూజలు నిర్వహించి ప్రభ ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ శాంతి కోసం రజకులు చేస్తున్న జాతర ఉత్సవం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. శ్రీ ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీమతి కోడె విజయలక్ష్మి, యుగంధర్ దంపతులు మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా ఆదిలక్ష్మి రజక సంఘం రాజకీయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ జాతర ఉత్సవాన్ని మహా జాతరగా 8 రోజులు పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


వేల్పూరులో స్వయం సహాయక సంఘాల మహిళలకు కడక్ నాథ్ కోళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. మంగళవారం తణుకు మండలంలోని దువ్వ, తేతలి, వేల్పూరు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పెంపకంలో భాగంగా 100 యూనిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోళ్ల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 100 యూనిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో యూనిట్‌లో 15 కడక్ నాథ్ కోళ్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ ఏ రామకృష్ణ, ఇతర సిబ్బంది, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా నాయకులు వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటితరంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి సమగ్ర చట్టం చేయాలని ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం ఎన్‌జీఓ హోంలో యూనియన్ అధ్యక్షుడు బండి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఇఫ్టూ జిల్లా నాయకులు మామిడి దాన వర ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సదుపాయం, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, పని భద్రత చూపాలన్నారు. ఎలక్ట్రానిక్ వృత్తిదారులకు సంక్షేమాలు అమలు చేసి వారి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. నిత్యవసర ధరలు తగ్గించాలని, కార్మిక సంక్షేమానికి నిధులు కేటాయించి అందరికీ ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, రాము, ఆదినారాయణ, చంటి, చిన్నరాము, శ్రీనివాస్‌బాబు, అప్పన్న, రమేష్, మోహన్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలి


రోడ్డు భద్రత వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు

తాడేపల్లిగూడెం (టీఓసీ):రోడ్డు భద్రతా నియమాలను తప్పకుండా పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్ బాబు అన్నారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎవరికి వారే బాధ్యత వహించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారిపై ప్రయాణించే వారు తప్పక స్వయం నియంత్రణ కలిగి ఉండాలని తెలిపారు. డ్రైవర్లుకు రోడ్డు, వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగడం వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని తగు జాగ్రత వహించాలన్నారు. రూరల్ సీఐ ఎస్.వి.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయని, భారతదేశంలో సంవత్సరానికి సుమారు రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ శిరిగినీడి విజయకృష్ణ, ఎస్సైలు రాజు, భద్రరావు, న్యాయవాదులు రామకృష్ణ, ఫరోత్‌బాబు, ఇజ్రాయిల్ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సమస్యలకు పరిష్కారం


కడియద్ద గ్రామంలో ప్రధాన డ్రెయిన్‌లో పూడిక తీసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడియద్ద గ్రామంలో సమస్యలను అధికారులు పరిష్కార మార్గాలను సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలోని ప్రధాన డ్రెయిన్, పాడైన విద్యుత్ స్తంభాలు, లైన్లు వంటి సమస్యలను మంత్రికి విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి ఆయా సమస్యలకు తగు పరిష్కార మార్గాలను అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సత్వరం సదరు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడంతో చకచకా పనులను పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రామంలోని డ్రెయినేజీ పూడిక తీత, విద్యుత్ లైన్లు, స్తంభాల మార్పు వంటి పనులను సంబంధిత శాఖ అధికారులు పరిష్కరిస్తున్నారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

28న మెగా వైద్య శిబిరం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య శిబిరం బ్రోచర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ విజయవాడకు చెందిన అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఉన్నత భారత్ అభియాన్ దత్తత గ్రామాలైన పెద్దఅమిరం, కోపల్లె, కాళ్లకూరు, కాళ్ల, జక్కరం గ్రామాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్ సీఈవో పి.శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో మహిళలకు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీక్ వర్మ, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పీఏ రామకృష్ణమరాజు, యూపీఏ కనీ్వనర్ డాక్టర్ జి.మెహర్ గణేష్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం

అత్తిలి: స్థానిక శ్రీఉమాసిద్దేశ్వరస్వామివారి ఆలయంలో నూతనంగా నిర్మించిన సూర్యాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహ మండపం, చండీశ్వరాలయం, ముఖద్వారాలకు గణపతిపూజా కార్యక్రమంతో మంగళవారం ప్రారంభించారు. ఋత్వికులు ఆధ్వర్యంలో యాగశాలలో హోమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన కలశారాధన, మూల మంత్రజపాలు, ధ్వజారోహణం చేసారు. ఈనెల 25న హోమ పూజలు, 26న విగ్రహ ప్రతిష్టాపన, పూర్ణాహుతి, అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న తెలిపారు. ఆలయ అర్చకులు అయిలూరి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తారు. విగ్రహ ప్రతిష్ఠాపన పూజకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

ఆకివీడు: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఇద్దరు మంగళవారం వేరువేరు ఆసుపత్రుల్లో మృతి చెందినట్లు రైటర్ నాగభూషణం తెలిపారు. స్థానిక శ్రీరామపురానికి చెందిన కల్యాణం వరలక్ష్మి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పురుగు మందు తాగి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. ఆకివీడు మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన కోట సూర్యారావు ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి భీమవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన నాక్ తనిఖీలు

తణుకు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులు, భోదనా సామర్యాలను పరిశీలించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు నివేదిక ఇచ్చేందుకు ఉద్దేశించిన నాక్ బృందం రెండు రోజుల పర్యటన మంగళవారంతో ముగిసింది. సవరించిన నిబంధనల ప్రకారం నాక్ రాష్ట్రంలోనే మొదటి సారిగా తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తనిఖీ చేసినట్లు నాక్ తనిఖీ బృందం చైర్మన్ డాక్టర్ షరీఫ్ అహ్మద్ తెలిపారు. నాక్ 1994లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఆర్థిక వనరులు, సహజ వనరులు, పరిశోధనా, బోధనా సదుపాయాలను, పరిపాలనా సామర్థ్యాలను మదింపు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా మొదటి రోజు కళాశాల్లో పూర్వ విద్యార్థులు, దాతలు, ప్రస్తుత చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించి వారి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో నాక్ బృందం పరిశీలన ఆధారంగా కళాశాలకు గ్రేడ్ ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా తనిఖీల వివరాలను ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో నాక్ తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ ఎన్ రంగస్వామి, డాక్టర్ జాస్మిన్ మతియా లగన్, దాతలు చిట్టూరి వెంకటేశ్వరరావు, మల్లిన రామచంద్రరావు, పూర్వ విద్యార్థుల తరపున చిలుకూరి రామకృష్ణ, బసవ రామకృష్ణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతోనే పోషకాలు

తాడేపల్లిగూడెం: వరి,గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను తీసుకుంటూ సరైన పోషకాలను, పీచు పదార్థాలను మన ఆహారంలో ఉండేలా చూసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్ చెప్పారు. 2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా మంగళవారం ఉద్యానవర్సిటీలో జరిగిన వెబినార్‌లో వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా వీసీ టి.జానకీరామ్ మాట్లాడుతూ చిరు ధాన్యాలలో అన్ని రకాలైన విటమిన్లు, పోషకాలు ఉన్నాయని, విశ్వవిద్యాలయ హాస్టళ్ల మెనూలోనూ చిరు ధాన్యాలు అందించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈసందర్భంగా మిల్లెట్స్ క్యాలండర్‌ను ఉపకులపతి ఆవిష్కరించారు. ఐఐఎంఆర్ సీనీ.రత్నావతి మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగులో వివిధ విధానాలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, దానికి అవసరమైన ఉపకరణాలు ఔత్సాహిక రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ పద్మావతమ్మ, ఎల్.నారం నాయుడు, ఈ.కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలు, హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులను ప్రోత్సహించాలి


తణుకులో విద్యార్థినికీ బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

తణుకు అర్బన్: హస్తకళలు, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను ప్రోత్సహించాలని తణుకు మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన హస్తకళా నైపుణ్యం - హ్యాండీక్రాఫ్ట్ ప్రదర్శన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హస్తకళలతో పాటు చేతి తయారీ వస్తువులను ప్రదర్శనగా ఉంచారు. ముందుగా విద్యార్థులకు హస్తకళల ప్రాముఖ్యతపై వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి మంత్రిత్వశాఖ, ప్రభుత్వ విభాగం డైరెక్టర్ అపర్ణ, సుధీర్, పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌వీవీ ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, వీరబాబు, పాపారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షకు 98 మంది విద్యార్థుల హాజరు


పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎన్‌సీసీ అధికారి గణపతి రావు, పాఠశాల హెచ్‌ఎం ఏఎస్ఆర్ మూర్తి దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): 19 ఆంధ్రా బెటానియన్‌కి చెందిన ఎన్‌సీసీ విభాగంలో 2 సంవత్సరాలు కాల పరిమితికి సంబంధించి శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులకు మంగళవారం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి కేవీ గణపతిరావు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహించారు. జెడ్పీ పాఠశాలకు 38 మంది, శశి స్కూల్ 32 మంది, టీబీఆర్ సైనిక స్కూల్ 28 మంది, మొత్తం 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు గణపతిరావు తెలిపారు. ఈ పరీక్షలను ఏలూరుకు చెందిన సుబేదార్ దేవేంద్రసింగ్, సీహెచ్‌ఎం వికాస్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఏఎస్ఆర్ మూర్తి, సీనియర్ ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పెంటపాడు: మండలంలోని ఉమామహేశ్వరం గ్రామంలో మంగళవారం సాయంత్రం పేకాట స్థావారాలపై పెంటపాడు పోలీసులు దాడులు చేసారు. ఈ సందర్భంగా 6 గురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ. 16,700ల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. గూడెం రూరల్ ఎస్సై వీఎస్ వీరభద్రరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయన్నారు.

